

విద్య విలువైంది : జడ్జి

ప్రజాశక్తి - కడప : విద్య విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ప్రభుత్వ పరిశీలన గృహాన్ని జడ్జి జడ్జి బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, భద్రత ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వంటశాలను వసతిగదులను టాయిలెట్లను తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద ృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గ ృహం, ప్రభుత్వ పరిశీలన గ ృహం సూపరింటెండెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐటియు ఆల్ ఇండియా

మహాసభలను జయప్రదం చేయండి

- స్టిక్కర్ల ఆవిష్కరణలో నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఐటియు 18వ ఆల్ ఇండియా మహాసభలు ఈనెల 31 నుంచి 2026, జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తూ ఉన్నారని, మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో మహాసభల స్టిక్కర్‌ను ప్రజా సంఘాల నాయకత్వం విడుదల చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సారి నిర్వహిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. ఈ మహాసభలకు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు కోడ్స్ తీసుకురావడం దుర్మార్గమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో విశాఖలో మహాసభలు జరగడం అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని పేర్కొన్నారు. ఈ మహాసభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తులో పోరాట ప్రణాళిక రూపొందించడం కోసం విశాఖ వేదిక కానున్నదని తెలిపారు. జనవరి 4న విశాఖలో జరిగే ర్యాలీ, బహిరంగ సభను జిల్లాలో ఉన్నటువంటి కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అన్వేష్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రా రెడ్డి, కెవిపిఎస్ నగర కార్యదర్శి నరసింహ, పెన్షనర్ అసోసియేషన్ జిల్లా నాయకులు నారాయణరెడ్డి, ఆప్కాస్ జిల్లా అధ్యక్షులు పవన్, కళ్యాణ్, ఉదయ్, సి.పి.రమణ పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించాలన్నారు ఆదివారం, సోమవారం ,మంగళవారం ఆటో జాతాలు, స్కూటర్ జాతాలు, పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కోరారు.



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

వేతన బకాయిలు చెల్లించకపోవడం దారుణం

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు మూడు నెలలగా వేతన బకాయిలను చెల్లించకపోవడం దారుణమని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్‌కు వేతనాలు ఇవ్వకుండా కార్మికులను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నూటికి పది, ఐదు రూపాయలు వడ్డీలకు తెచ్చుకుని పిల్లలకు బట్టలు కొనే పరిస్థితిలో కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి తీసుకుని వచ్చిన కార్పొరేషన్ సిగ్గుతో తలచుకోవాలని పేర్కొన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకరి రవి మాట్లాడుతూ ప్రభుత్వానికి, పాలకవర్గాలకు, కార్పొరేషన్ అధికారులకు మున్సిపల్ కార్మికుల అంటే చిన్న చూపు చూడడమే వారి ఎజెండగా పెట్టుకుని పని చేస్తున్నారని తెలిపారు. కార్మికుల శ్రేయస్సు కోరుకునే వారతే తక్షణం 2021 నుంచి ఇప్పటివరకు చనిపోయిన ఆప్కాస్ కార్మికులకు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆప్కాస్ కార్మికులను 60 సంవత్సరాలు రిటైర్మెంట్ పేరుతో తొలగించి నేటికీ వారి ఇంట్లో ఉద్యోగం ఇవ్వకపోగా వారిని అడిషనల్ వర్కర్లుగా పని చేపించుకుంటూ ఏడు నెలలుగా వేతనని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. కార్పొరేషన్ అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ మాట్లాడుతూ కార్మికులు ఆశతో పని చేస్తూ ఉన్నారని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే సంక్రాంతి పండుగకు నగర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరాములు, నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, నగర డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకరి కిరణ్, మహేష్, పోలయ్య, నాగరాజ్, పెంచలయ్య, రాజు, హరిక ృష?, హరి, సుబ్బయ్య, రమీజా కార్మికులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సాగు భూములను కాంట్రాక్టర్‌కు ఇవ్వడం దుర్మార్గం

- తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 2050లో స్థానిక సాగులో ఉన్న భూములను హైవే రోడ్డు కాంట్రాక్టర్‌కు ఇవ్వటం చాలా దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, ఉపాధ్యక్షులు కోనేటి నరసయ్య అన్నారు. శుక్రవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూమి కోల్పోయిన పేదలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ సోమశిల నిర్వాసితులు కొత్త మాధవరం, ఒంటిమిట్ట ముకుందాశ్రమం, మల్లేశ్వరపురం గ్రామాలకు చెందిన పేదలు సర్వే నెంబర్ 2050 ప్రభుత్వ భూమి 2018 సంవత్సరం నుంచి లక్షలు ఖర్చు చేసి ఆముదాలు పంటలు సాగు చేపట్టారన్నారు. అటువంటి భూమిని హైవే కాంట్రాక్టర్లకు క్రషర్ మిషన్‌కు అప్పజెప్పడం సమంజసం కాదన్నారు. తొమ్మిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు సాగు చేసుకున్న పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా పట్టాలు ఇవ్వాలని అనేక దఫాలు తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి వినతి పత్రాల ద్వారా విన్నవించినా, ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు పట్టాలు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని పేర్కొన్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు, పేదల భూములు నష్టపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల కాంట్రాక్టు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రాము, సాంబయ్య, హరి, పద్మావతి, చంద్రకళ సుమతి, లక్ష్మీ దేవమ్మ పాల్గొన్నారు.

'సీమ'లోనే మైక్రోసాఫ్ట్‌ను ఏర్పాటు చేయాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చింతామోహన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాయలసీమలోనే మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెట్టేలా సంప్రదింపులు చేయాలని, రాయలసీమ రతనాల సీమగా మారుతుందని, నిరుద్యోగం, వెనుకబాటుతనం వంటి రుగ్మతలు మాయమవు తాయని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదేళ్ల ఇటీవల ప్రధాని మోడీని కలిసి ఇండియాలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెడతామని సంప్రదింపులు చేశారన్నారు. మోడీ మైక్రోసాఫ్ట్ పెట్టుబడులను గుజరాత్‌కు తరలించాలనుకుంటున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని రాయలసీమ వాసియైన సత్య నాదెళ్లతో సంప్రదింపులు చేసి రాయలసీమకు పెట్టుబడులను తీసుకుని రావాల్సిన అవసరం ఉందన్నారు. సీమ రైతుల పొలాల రేట్లు గణనీయంగా పెరుగుతాయని, కోటీశ్వరులవుతారని తెలిపారు. రాయలసీమ నుంచి ఏడుగురు ముఖ్యమంత్రులయ్యారన్నారు. రాయలసీమలో రాళ్లు, అరటి చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ పెట్టుబడులే ఏకైక మార్గమని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన తిరుపతిలోని సంస్కృత యూనివర్శిటీని ఆర్‌ఎస్‌ఎస్ విద్యాపీఠంగా మార్చే ందుకు మోహన్‌భగవత్‌తో కలిసి కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాలల ఏర్పాటులో పిపిపి ఆలోచన మంచి దేనని, కానీ ఆచరణ మాత్రం సాధ్యం కాదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపీగౌడ్, రవి పాల్గొన్నారు.

శ్రీనిధి, వైవీయూ మధ్య ఎంఒయు

ప్రజాశక్తి - కడప అర్బన్

పరిశోధన, నైపుణ్య అభివృద్ధి ఆహార పరిశ్రమ విద్యా సహకారాన్ని ప్రోత్సహించడానికి ప్రొద్దుటూరు శ్రీనిధి డెయిరీ, కడప యోగి వేమన విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకం చేశాయి. వైవీయూ విసి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, శ్రీనిధి డైరీ మేనేజింగ్ డైరెక్టర్ రేగంటి సురేష్ బాబు, ప్లాంట్ మేనేజర్ బాలయ్య ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ తమ విద్యార్థుల డైరీ ప్లాంట్ సందర్శన, ఇంటర్నెట్ షిప్, ప్రాజెక్టుల నిర్వహణ, ప్లేస్మెంట్స్ ఇవ్వడానికి శ్రీనిధి డెయిరీ వారు ముందుకు వచ్చారని తెలిపారు. నేపథ్యంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు సాంకేతికపరమైన, నైపుణ్యతలలో, పరిశోధనలలో వారికి సహకరిస్తారని వివరించారు. నైపుణ్యతకు డెయిరీ సంస్థ మౌలిక సదుపాయాలు కలిస్తే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. అధునాతన ఆహార ప్రాసెసింగ్, అలానే పాల సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడంలో ఈ రెండు సంస్థలు కలసి పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్, ప్రొఫెసర్ దాము, పిఎం-యుఎస్‌హెచ్‌ఎ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రియా జున్నిసా, పిఎం ఉషా సాఫ్ట్ కాంపోనెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పిఎఫ్ సొమ్ము జమచేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప మండలానికి చెందిన ఉపాధ్యాయుల పిఎఫ్ సొమ్ములు జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్‌కు జమ చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు జిల్లా ఉపఖజానా శాఖ అధికారి వెంకటేశ్వర్లును కోరారు. శుక్రవారం జిల్లా ఉపఖజానా శాఖ కార్యాలయంలో డిడి వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ 2021వ సంవత్సరం డిసెంబర్ జీతాల బిల్లుతోపాటు పిఎఫ్‌కు సంబంధించి మినహాయింపులు చేసినప్పటికీ వాటికి సంబంధించిన షెడ్యూలు జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్‌కు పంపకపోవడం వల్ల అవి మిస్సింగ్ క్రెడిట్ గా ఉన్నాయని పేర్కొన్నారు. 133 మంది ఉపాధ్యాయుల, దాదాపు రూ. 10 లక్షల సొమ్ము జమ కాకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ఆ నెలకు సంబంధించిన షెడ్యూలు జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్‌కు జమ చేయాలని కోరారు. డిడి స్పందిస్తూ ఉపాధ్యాయుల మిస్సింగ్ క్రెడిట్స్ ఉన్న మాట వాస్తవమేనని, వాటన్నింటిని వెంటనే పరిష్కరించి జిల్లా పరిషత్ కార్యాలయానికి షెడ్యూల్స్ పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కడప మండల ప్రధాన కార్యదర్శి చెన్నయ్య పాల్గొన్నారు.

సెలవులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కడప

ఏడాదికి సంవత్సరానికి 15 సాధారణ, మరియు మహిళా కాంట్రాక్ట్ అధ్యాపకులకు అదనంగా 5 ప్రత్యేక సాధారణ సెలవులు మంజూరు చేయాలని ఉమ్మడి కడప జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘ అధ్యక్షుడు రెడ్డిబాషా ఆధ్వర్యంలో జోన్-4, డిగ్రీ కళాశాలల ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిబాషా మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులకు పూర్తిస్థాయిలో 15 సాధారణ సెలవులు వినియోగించుకునేందుకు అనుమతించకపోవడం, కొన్ని కళాశాలల్లో సాధారణ సెలవులను మూడు నెలల కాలపరిమితిలో ల్యాప్స్ చేయడం శోచనీయమన్నారు. చాలామంది అధ్యాపకులు 50 ఏళ్లకు మించిన వయస్సు కలిగి ఉండటంతో పాటు వివిధ ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో తగినంత సెలవులు లేకుండా బోధనా, పరిపాలనా విధులను సమర్థవంతంగా నిర్వహించడం తీవ్రమైన ఇబ్బందిగా మారుతుందన్నారు. అందువల్ల మానవతా దృష్టికోణంతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జోన్-4 పరిధిలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అవసరమైన స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారెడ్డి, సుభాని, సంపత్ కుమార్, జ్ఞానేశ్వర్ రెడ్డి, రేణుక, సునీత, రాధిక పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న రెడ్డిబాషా



ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులు ఆపాలి

ప్రజాశక్తి - వేముల

టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులు వెంటనే ఆపాలని కెకె కొట్టాల గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. శుక్రవారం వారు పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ సమస్యలు పరిష్కరించిన తర్వాతే టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులు ప్రారంభిస్తామని యురేనియం అధికారులు కలెక్టర్‌కు ఇచ్చిన హామీని మరచి, ప్రస్తుతం టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులను ప్రారంభించడం అన్యాయమని వాపోయారు. యురేనియం కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థాలను నిల్వ చేసే టెయిలింగ్ పాండ్ వల్ల నష్టపోతున్నామంటూ కొనేళ్లుగా తాము ఆందోళన చేస్తున్నామని చెప్పారు. టెయిలిగ్ పాండ్ నిల్వ సామర్థ్యం పూర్తికావడంతో ఉన్న టెయిలిగ్ పాండు ఎత్తు పెంచేందుకు యురేనియం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆర్‌డిఒను కోరారు.

అనుమానిత ప్రాంతాలపై డ్రోన్‌తో నిఘా

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. మైదుకూరు డిఎస్‌పి జి.రాజేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో మైదుకూరు అర్బన్ సిఐ కె.రమణారెడ్డి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తున్నారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో పాటు పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి జల్లెడ పడుతూ దాడులు చేయిస్తూ నిందితులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు.



తలపడుతున్న ఇరు జట్లు

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప

వైఎస్ఆర్ రాజారెడ్డిఎసిఎ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. మ్యాచ్‌లో రుద్ర లఖాన, హర్వాన్స్ సింగ్ సెంచరీలు చేయడంతో రెండవ ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర జట్టు రెండవ ఇన్నింగ్స్ లో భారీ స్కోరు సాధించింది. నాలుగు వికెట్ల నష్టానికి 107 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మూడవరోజు బ్యాటింగ్ ప్రారంభించిన సౌరాష్ట్ర జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 113.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 452 పరుగుల భారీ స్కోరు సాధించింది. జట్టులోని రుద్ర లఖాన 106 పరుగులు (సెంచరీ) చేశాడు, హర్వాన్స్ సింగ్ 158 పరుగులు (సెంచరీ) చేశాడు. ఆర్యన్ 60 పరుగులు చేశాడు. ఆంధ్ర జట్టులోని తోషిత్ యాదవ్ 3, ఎం. సాయి 3, ఏ ఎన్ వి లోహిత్ 2 వికెట్లు తీసుకున్నారు.

రేపు ఉచిత వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : నగరంలోని ఎర్రముక్కపల్లిలోని ఉన్న దూదేకుల భవన్‌లో ఈ నెల 28వ తేదీన ఏర్పాటు చేసిన ఉచిత దూదేకుల, నూర్‌బాష్ ఉచిత వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆయిల్‌మిల్ ఓబులేస్, జిల్లా అధ్యక్షులు ఖాదరయ్య, పి.మస్తాన్‌సాహెబ్, అజ్మతుల్లా పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం వరకు వివాహాలు కాని అవివాహితుల కుటుంబాలు పరస్పరం సంప్రదింపులు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పరిచయం వరకు తాము పరిమితమని, విచారణ మాత్రం మీరే చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఉచిత వివాహ వేదిక కార్యనిర్వాహకుల 9652221967, 9441276127 సెల్‌నెంబర్లను సంప్రదించి పేర్లు, తదితర వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకో వాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాన్ని ఉల్లంఘించిన వారిని

విధుల్లోంచి తొలగించాలి

- కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి

డిసెంబర్-26, కడప.

చట్టాన్ని ఉల్లంఘించి దురుసుగా, దౌర్జన్యంగా ప్రవర్తించిన చిప్పగిరి, పత్తికొండ ఎస్ఐలు, పోలీసులను తక్షణం సస్పెండ్ చేయడంతో పాటు వారిని ఉద్యోగం నుంచితొలగించాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీ.వి. రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని పత్తికొండ, చిప్పగిరి ఎస్ఐలు, పోలీసులు న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించడాన్ని కడప బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ కోర్టులో శివయ్య అనే ముద్దాయి తన అడ్వకేట్ ద్వారా సరెండర్ కావడానికి న్యాయస్థానానికి వచ్చారన్నారు. అడ్వకేట్ ద్వారా సరెండర్ సర్టిఫికెట్ దాఖలు చేశారన్నారు. న్యాయమూర్తి నిర్ణయం తీసుకోక ముందే బెంచ్ దగ్గర కూర్చున్న ముద్దాయిని మఫ్టీలో తమ సిబ్బందితో వచ్చిన చిప్పగిరి, పత్తికొండ ఎస్ఐలు కోర్టు హాలులోకి అప్రజాస్వామికంగా వచ్చి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ముద్దాయి చొక్కా పట్టుకొని లాక్కెళ్లారన్నారు. అడ్డుకున్న నిందితుడి తరుపు న్యాయవాదిని నెట్టివేసి దౌర్జన్యంగా, బలవంతంగా జీపులో తీసుకువెళ్లారన్నారు. ఇది అన్యాయం అంటూ న్యాయవాదులు ప్రశ్నించినా కూడా లెక్కచేయకుండా వారిని పోలీసులు పక్కకు నెట్టేశారన్నారు. ఈ విషయమై పత్తికొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఎదుట పెద్ద ఎత్తున నిరసన చేపట్టారన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన చిప్పగిరి, పత్తికొండ ఎస్సైలు, పోలీసులు అదే చట్టాన్ని ఉల్లంఘించి న్యాయస్థానంలోనే దౌర్జన్యం చేయడాన్ని కడప బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన ఎస్సైలు, పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి వారిని ఉద్యోగం నుండి తొలగించాలని కడప బార్ అసోసియేషన్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. పత్తికొండ బార్ అసోసియేషన్ న్యాయవాదులకు మద్దతుగా శుక్రవారం కడప కోర్టులో న్యాయవాదులు అందరూ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న రాఘవరెడ్డి

ఆశాజనకంగా వేరుశనగ ధరలు

బస్తా ధర రూ.3,500 - ఈ ఏడాది తగ్గిన సాగు



నరహరిపురం వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వేరుశనగ కాయలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ దిగుబడి, ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. మండల పరిధిలో వెదురూరు, రాజుపాలెం, తిప్పిరెడ్డిపల్లె, నరహరిపురం, కుచ్చుపాప గ్రామాల పరిధిలో సెప్టెంబర్‌లో వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. నవంబర్‌లో పడిన అధిక వర్షాలకు, తుపాన్ తాకిడికి వేరుశనగ పంట అధికంగా దెబ్బతిని దిగుబడులు గణనీయంగా తగ్గుముఖం పడతాయని రైతులు భావించారు. ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు వరకు దిగుబడి వచ్చింది. అలాగే ధరలు ఈ ఏడాది బస్తా రూ. 3500 వరకు పలుకుతున్నాయి. గతంలో బస్తా ధర రూ. 2300 నుంచి రూ.2600 లోపు పలికేవి. ఈ ఏడాది రూ.1000 వరకు పెరిగాయి. గతంలో మండల పరిధిలో రూ. 3వేల ఎకరాలకు పైగా వేరుశనగ సాగు రైతులు చేపట్టేవారు. ఈ ఏడాది సాగు తగ్గుముఖం పట్టి 2వేల ఎకరాలలోపు మాత్రమే సాగు చేపట్టారు. సాగు తగ్గిన సమయంలో ధరలు అధికంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కాయలు నాణ్యతగా ఉంటే రూ. 3500 వేలకు పైగా పలుకుతున్నాయి. మండల పరిధిలో 2 వేల ఎకరాల వరకు వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వ్యాపారులు అధికంగా సేకరిస్తున్నారు. ప్రొద్దుటూరు మిల్లులకు వేరుశనగ కాయలను అధికంగా తరలిస్తున్నారు. 40కి పైగా దిగుబడి వచ్చిన రైతులకు ఎకరాకు రూ.1.30 లక్షల వరకు వస్తుంది .ఎకరాకు ఖర్చులకు ఈ ఏడాది రూ.50 వేల వరకు వచ్చాయని రైతులు పేర్కొంటున్నారు. దిగుబడి బాగా రావడంతో ఈ ఏడాది ఎకరాకు రూ. 70 వేల వరకు ఆదాయం ఉందని రైతులు పేర్కొంటున్నారు. .సాగు ఖర్చులు ప్రస్తుతం పెరిగాయని అదే సమయంలో దిగుబడి, ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఎకరాకు 50 వేల లోపు ఆదాయం ఉందని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వస్తే కాస్త ఊరటగా ఉంటుంది అని పంట పూర్తిగా దెబ్బతిన్న రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మాత్రం విత్తన కాయలు సరఫరా చేసింది.



ఎంఆర్‌పి ధరలకే ఎరువులు విక్రయించాలి

ప్రజాశక్తి - వల్లూరు

ఎరువుల దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ధరలకు మాత్రమే ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు బి. చంద్ర నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వల్లూరులో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ తరలించిన లేదా నిబంధనలు విరుద్ధంగా అధిక ధరలకు రైతులకు విక్రయించిన ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని డీలర్లను హెచ్చరించారు. మండలానికి ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 120 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందజేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడరాదని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ కార్యాలయం టెక్నికల్ అధికారి గోవర్ధన్, వ్యవసాయ విస్తరణ అధికారి సుబ్బనర్సయ్య పాల్గొన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న జెడి



భూమి పూజ చేస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి

సిసి రోడ్డు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో 8 లక్షల ఎంజిఎన్ఆర్‌జిఎస్ నిధులు, గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షల (మొత్తం రూ.13 లక్షల) వ్యయంతో సిసి రోడ్డు పనులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపిపి సింగారెడ్డి రాఘవరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పట్నం లక్ష్మణ్ కుమార్, బచ్చల ప్రతాప్, ఆవుల రాజేశ్వర్ రెడ్డి, వార్డు మెంబర్ ఆది, శంకర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, సుబ్బారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, సునీల్, పంచాయతీ రాజ్ డిఇ లక్ష్మీనారాయణరెడ్డి, ఎఇ గణేష్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, భూతే, సంగమేశ్వర స్కూల్ ప్రసాద్, వెంకట సుబ్బయ్య, గౌస్, సుధాకర్, కుళశేఖర్, తాటి శీను, గోపి, అంజి, సుబ్బారావు శెట్టి, సుబ్బారావు, మధు, పొన్నపురెడ్డి ప్రతాప్ రెడ్డి, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

'పిపిపి'పై విష ప్రచారం శోచనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పిపిపి విధానంపై కేవలం రాజకీయ పార్టీలు విష ప్రచారం చేయడం శోచనీయమని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పివిఎస్‌వి ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ఆర్థిక పరిస్థితి కానీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కానీ ఆశించిన స్థాయిలో లేదనేది వాస్తవం అన్నారు. ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన నాయకులు వాటిని విస్మరించి అభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాలు పట్ల విమర్శలు చేయడం సరికాదని అన్నారు. రెండు సంవత్సరాలలో మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వస్తే పేద విద్యార్థులకు మెడికల్ విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెడిసిన్ చదవాలంటే త్వరిత గతిన కళాశాలలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అభివృద్ధికి సహకరించాలి తప్ప రాజకీయ పార్టీలు అడ్డుగా నిలిస్తే ప్రజలు క్షమించరని చెప్పారు. రాజకీయ పార్టీలు హుందాగా అభివృద్ధికి మద్దతు పలకాలని కోరారు.



భూపేష్‌ను సన్మానిస్తున్న వెంకటసుబ్బారెడ్డి

భూపేష్‌రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు భూపేష్ సుబ్బారామిరెడ్డిని టిడిపి సీనియర్ నేత దేశం వెంకట సుబ్బారెడ్డి ఘనంగా సన్మానించారు. జమ్మలమడుగులో ఉన్న టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బారామిరెడ్డిని శుక్రవారం వేంపల్లెకు చెందిన సీనియర్ నాయకుడు దేశం వెంకట సుబ్బారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం అభినందనీయమని చెప్పారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని వెంకట సుబ్బారెడ్డిని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బారామిరెడ్డి అధ్యక్షతన గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పని చేసి టిడిపి విజయ ఢంకా మోగిస్తామని చెప్పారు. ఎన్నికలకు ముందు పార్టీ కోసం పని చేసిన వారందరిని కలుపుకొని పోవాలని జిల్లా అధ్యక్షుడిని కోరినట్లు తెలిపారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

పోలీసుస్టేషన్‌లో డిఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని పోలీసుస్టేషన్‌ను శుక్రవారం మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ స్టేషన్ సిబ్బందితో గౌరవ వందనాన్ని స్వీకరించారు అనంతరం ఆయన స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. మాట్లాడుతూ మండలంలో గ్రామాలలో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ గొడవలు కక్షలు రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. మారుమూల ప్రాంతం కనుక పేదలు ఎలాంటి తప్పిదాలు చేయకుండా ముందు జాగ్రత్తగా అవగాహన కల్పిస్తూ వృత్తిరీత్యా మీ ధర్మ మీరు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌క్ష్మి యోగేంద్ర, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపేటను పంచాయతీ చేస్తే వ్యతిరేకిస్తాం

ప్రజాశక్తి- కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లె ఎస్‌సి, బిసి కాలనీలను కలిపి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని శుక్రవారం గ్రామ ప్రజలు ఎంపిడిఒ మహబూబ్‌బీకి వినతి పత్రం అందించారు. అలా కాకుండా కొండపేట పంచాయతీగా చేస్తే పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. రెండు వీలు కాకపోతే గతంలో తెల్లపాడు గ్రామపంచాయతీగా ఉన్న దానిని అలానే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

పరీక్ష రిజిస్ట్రేషన్ వేగవంతంగా చేయాలి

ప్రజాశక్తి - వల్లూరు

విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమం 'పరీక్షా పే చర్చ' రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డైట్ లెక్చరర్ కె.వి.సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్, కెజిబివి పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 11 లోపు ప్రతి పాఠశాలలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పరీక్షల పట్ల ఉండే భయం తొలగిపోవడమే కాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసేందుకు దోహదపడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు సాక్షాత్తు ప్రధానమంత్రితో మాట్లాడే అరుదైన అవకాశం కలుగుతుందని, వారి సలహాలు, సూచనలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని ఆయన వివరించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి గడువు లోపల అర్హులైన వారందరితో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ఆయన తెలియజేశారు.



మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ కె.వి.సుబ్బారెడ్డి

హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల: ముద్దనూరు-మంగపట్నం మధ్య చెన్నారెడ్డిగారిపల్లె సమీపంలో ఐదు నెలల కిందట ఒక వ్యక్తిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన నిందితులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రైల్వేపోలీస్‌స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే సిఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది జులై 25న చెన్నారెడ్డిగారిపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం రైల్వే ట్రాక్ పై పడి ఉందని రైల్వే అధికారులకు సమాచారం అందించారన్నారు. ఆ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారని చెప్పారు. ఆ గుర్తు తెలియని వ్యక్తి ఫ్లెక్సీ, ఫొటోను డిఎస్‌పి తిరుపతి ఉత్తర్వుల మేరకు ప్రతి రైల్వే పోలీస్ స్టేషన్ లలో తగిలించామని పేర్కొన్నారు. ఆ ఫ్లెక్సీ లను చూసి మృతుడి బంధువులు పైడిపాలెం వెంకట కిషోర్‌గా గుర్తించారన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు విచారించామని తెలిపారు. హత్యచేసిన నలుగురు నిందితులు ముందుగానే తొందరు విఆర్‌ఓ దగ్గరకు వెళ్లి లొంగిపోయారని తెలిపారు. ప్రధాన నిందితుడు నరసింహులు గ్యాస్ డీలర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. మృతుడు పైడిపాలెం వెంకట కిషోర్‌తో ఆరేళ్లుగా నరసింహులు భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందన్నారు. విషయం నరసింహులు తెలియడంతో ఇద్దరిని మందలించారని చెప్పారు. కిషోర్‌కు వివాహం అయినా కూడా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు వద్దన్నది, నరసింహులు, కిరణ్ అనే వ్యక్తితో కలిసి కిషోర్‌ను కొట్టడం, గట్టి వాదించుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో కిషోర్‌ను ఎలాగైనా చంపాలని తన బావ అయిన కిరణ్‌తో పథకం రచించాడన్నారు. కిరణ్ తన మేనల్లుడు కార్తీక్‌తో మాట్లాడి, కార్తీక్ స్నేహితుడైన క్రాంతి కుమార్‌కు కిషోర్ పరిచయం ఉండటంతో అతని



కేసు వివరాలు వెల్లడిస్తున్న రైల్వే సిఐ సుధాకర్‌రెడ్డి

ద్వారా చంపేందుకు పథకం రచించారని రైల్వే పేర్కొన్నారు. కార్తీక్, క్రాంతితో కలిసి కిషోర్‌ను చంపేందుకు రూ. ఐదు లక్షలు డీల్ కుదుర్చుకున్నారని, ఇందులో రూ. 30 వేలు కార్తీక్ కు అడ్వాన్స్ ముట్ట చెప్పారన్నారు. క్రాంతి, కార్తీక్ ఇద్దరు వివిధ కారణాలు చెప్పి పులివెందుల నుంచి కిషోర్‌ను మోటార్ సైకిల్ పై ఎక్కించుకుని చెన్నారెడ్డి గారిపల్లె సమీపానికి చేరుకుని అతనికి మద్యం తాపించి గొంతు నులిమి చంపేశారన్నారు. తరువాత ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నంలో రైల్వే ట్రాక్ పై కిషోర్ ను పడుకోబెట్టి అక్కడి నుంచి పరారయ్యారన్నారు. విషయం బయటకి రాదు అనుకుని తర్వాత ఎవరి పనులలో వారు నిమగ్నమయ్యారని, అయితే మృతుని బంధువులు కిషోర్‌గా గుర్తించడం, పోలీసులు విచారిస్తున్న క్రమంలో ఎలాగైనా దొరికి పోతామని భావించి నిందితులు లొంగిపోయారని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. రైల్వే డిఐజి ఏసుబాబు పర్యవేక్షణలో, డిఎస్‌పి ఎస్‌ఆర్ హర్షిత మార్గదర్శకత్వంతో కేసును ఛేదించామని సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రైల్వే ఎస్‌ఐలు భాస్కర్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, గోవిందప్ప, పోలీసులు పాల్గొన్నారు.

పంచాయతీల మార్పుపై వెల్లువెత్తిన నిరసనలు



అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మూడు గ్రామ పంచాయతీ లలో మార్పు చేర్పులకు సంబంధించి శుక్రవారం అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. ఈ గ్రామ సభలలో ప్రజల నుంచి ఏక్కవ శాతం మార్పులకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను వినిపించారు. వెదురూరు గ్రామపంచాయతీ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభ రసభాసాగా మారింది. వెదురూరు గ్రామపంచాయతీ నుంచి వి.రాజుపాలెం, నరిహరిపురం గ్రామాలను ఒక పంచాయతీగా చేస్తూ తీర్మానం చేయాలని అధికారులు ప్రతిపాదించారు. రాజుపాలెం గ్రామస్తులు ఉమ్మడి పంచాయితీగా వెదురూరులోనే కొనసాగాలని వారి అభిప్రాయాన్ని వెల్లడిస్తూ గ్రామసభను బహిష్కరించి వెళ్లిపోయారు. పంచాయితీ అభివృద్ధి సాధించాలి అంటే ఉమ్మడిగా కొనసాగడం అవసరమని వి.రాజుపాలెం గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గుంత చియ్యపాడులో ఏర్పాటుచేసిన సభలో చియ్యపాడులో ఉన్న తమ గ్రామాన్ని వేరుపరిచేందుకు సముఖత తెలిపారు. గ్రామానికి అదనంగా ఇతర పంచాయతీల నుంచి కలిపే గ్రామాల విలీనాన్ని వద్దని తెలిపారు. టి.ఒ. పల్లె పంచాయతీలోని రేపల్లెలో జరిగిన సమావేశంలో రేపల్లెను టిఒ పల్లె లోనే కొనసాగించాలని కోరారు. తక్కువ శాతంలో గుంతచియ్యపాడులో కలపాలని ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ సభలను పంచాయతీ కార్యదర్శులు ఉమా, చంద్రశేఖర్, కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీడీ యాక్టును ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

అనకాపల్లి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు పై అక్రమంగా బనాయించిన పీడీ యాక్ట్ కేసును వెంటనే ఉపసంహరించుకుని, ఆయనను విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మైదుకూరులోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పలరాజు భూములు కోల్పోతున్న పేద రైతులు, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న దళిత గిరిజన బలహీన వర్గాల వారి కోసం, ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కార్మికులు మత్స్యకారులు వారి ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యంగా శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్నారని చెప్పారు. దుర్బుద్ధితో ప్రభుత్వం ఆయన అక్రమ పీడియాక్ట్ కేసు పెట్టడం దుర్మార్గమని వారన్నారు. ఫార్మా కంపెనీ కార్పొరేట్ల కొమ్ము కాస్తూ వారిని సంతృప్తి పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడుతున్నతుందని వాపోయారు. వ్యాపారం కోసం సముద్ర తీరాన్ని పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్న వారి పట్ల ఉద్యమించటమే అప్పలరాజు తప్పా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

భూసేకరణను అడ్డుకుంటున్న వారిపై పిడియాక్ట్ ప్రయోగించమని ఆదేశించడం అన్యాయమని ఇది అయన నిరంకుశ వైఖరిని సూచిస్తుందని వారు అన్నారు. ఇటువంటి దుశ్చర్యలను ప్రజలు ప్రజాతంత్ర వాదులు పార్టీలు,సంఘాలు మేధావులు వ్యతిరేకించాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గురయ్యా రాజశేఖర్ రెడ్డి, రవి ఇమామ్, సుధాకర్, లక్షమయ్య పాల్గొన్నారు.

ఈ ఏడాదిలో 90 చోరీ కేసులు నమోదు

- 57 కేసుల్లో రూ.36.64 లక్షలు రికవరీ
- డిఎస్‌పి మురళీ నాయక్ వెల్లడి



సమీక్ష సమావేశంలో కేసు వివరాలు తెలుసుకుంటున్న డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈ ఏడాది పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో 90 దొంగతన కేసులు నమోదయ్యాయని ఇందులో 57 కేసుల సంబంధించి రూ. 36,64,350 రికవరీ చేశామని పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో జిల్లా ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్‌ఐలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2025లో నమోదైన పలు రకాల కేసుల గురించి చర్చించారు. ఇందులో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో 90 దొంగతనాలు నమోదు కాగా వాటిలో మొత్తం ప్రాపర్టీ రూ. 59,13,380 మొత్తంలో దొంగతనం కాగా వాటిలో 57 కేసులలో ముద్దాయిలను కనుగొని వారి ద్వారా రూ. 36,64,350 రికవరీ చేశామని వివరించారు. ఇందులో 60 శాతం చోరీ జరిగిన సొమ్మును రికవరీ చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న 33 కేసులలో నిందితులను కనుగొనటానికి పులివెందుల ట్రాఫిక్ సిఐ హాజీవల్లి ఆధ్వర్యంలో సిబ్బంది వేణుగోపాలరెడ్డి ,రామ్ రమేష్, శివ, సుబ్రమణ్యంతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. దొంగతనం కేసులకు సంబంధించి నేరాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో కనంపల్లె, అద్దాలమర్రి, పార్నపల్లెల వద్ద మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఇతర జిల్లాల నుంచి పులివెందులకు రాకపోకలు సాగించే వారిపై 24 గంటలు నిఘా ఉంచతామని చెప్పారు. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయో వాటిని గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించుకొని రోడ్డు ప్రమాదాలను తగ్గించటానికి నివారణ చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి చెప్పారు..

క్యాట్‌లో ట్రిపుల్‌ఐటి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యాభ్యాసం చేస్తున్న సయ్యద్ మహమ్మద్ సైఫ్ అనే విద్యార్థి 2025 కామన్ అడ్మిషన్ టెస్ట్ ఫలితాల్లో 98.18 శాతం పర్సెంటేజ్ సాధించినట్లు సిఎస్‌సి విభాగపు అధిపతి డాక్టర్ రత్నకుమారి తెలిపారు. శుక్రవారం ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో విద్యార్థి సయ్యద్ మహమ్మద్ సైఫ్‌ను డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, ఎఒ పెనుకొండ రవికుమార్, డీన్ అకడమిక్స్ రమేష్ కైలాష్ అభినందించారు. సయ్యద్ మహమ్మద్ సైఫ్ మంచి పర్సెంటేజ్ లో ఫలితాలు సాధించడంతో ప్రఖ్యాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ సంస్థల్లో సీటు దక్కించుకోవడం సంతోషంగా ఉన్నట్లు తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్

డిసిసిబి సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ముద్దనూరు : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ముద్దనూరు శాఖ ఫీల్డ్ సూపర్ వైజర్ కళ్యాణ్ బాబు తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సుపై కళాజాతా నిర్వహించారు. రైతు నేస్తం పథకం కింద వ్యక్తిగత, దీర్ఘకాలిక పంట, బంగారు, మహిళలకు స్వయం ఉపాధి సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కిడ్స్ బ్యాంకు ద్వారా విద్యార్థులకు అందించే పొదుపు ఖాతాలు గురించి వివరించారు. మ్యాజిక్ షో, జానపద గేయాలు విద్యార్థులను అలరించాయి.

అంధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

కీ.శే.వంగవీటి మోహన రంగా బడుగు బలహీన పీడిత శ్రామిక వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్ తెలిపారు. శుక్రవారం రంగా వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక వీరనారాయణ అంధుల ఆశ్రమంలో అనాథ మహిళలకు స్వీట్లు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులు తెలుసుకుంటూ వారి కష్టాల్లో ఒకడిగా ఎప్పుడు వెన్నంటిన ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగాఅని తెలిపారు. కార్యక్రమంలో పగడాల రాజశేఖర్ రాచనేని ఆంజనేయులు ఆశ్రమ నిర్వాహకులు రామమోహన్ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 3న మంగళవారం వైకుంఠ ఏకాదశి కోసం భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది తెల్లవారు జామున 1.30 గంటల నుండే స్వామి వారి దర్శనం ఉంటుందని ఆలయ అర్చకులు మయూరం కృష్ణస్వామి తెలిపారు. ఉత్తర ద్వారం వద్ద వైకుంఠ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనం ఇవ్వను న్నారని పేర్కొన్నారు. భక్తులు గమనించి తెల్లవారు జామున 1.30 నుంచే స్వామి వారి దర్శనానికి రావాలని తెలిపారు. 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు ఉత్తర ద్వారం వద్ద దర్శనం, అనంతరం శ్రీవారి గ్రామోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ

విద్యుత్ సమస్యలు తెలుసుకునేందుకే 'కరెంటోళ్ల జనబాట'

ప్రజాశక్తి- ఖాజీపేట

జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో నెలకొని ఉన్న విద్యుత్ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ కరెంటోళ్ల జనబాట కార్యక్రమం నిర్వహిస్తుందని జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఇ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని సి. కొత్త పల్లెలో పర్యటించి ప్రజలను విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాం, మరికొన్ని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో విద్యుత్ సిబ్బంది గ్రామాలలోకి వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు. అనంతరం ప్రజలకు సోలార్ రూఫ్ టాప్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా 65 ప్రాంతాలను సందర్శించామని చెప్పారు. 399 లోపాలను గుర్తించగా 212 లోపాలను సరిచేశామన్నారు. ఎపి ఎస్‌పిడిసిఎల్ సంస్థ ప్రజలకు చేరువయ్యేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. విద్యుత్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఇ నాగరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాలీబాల్, కబడ్డీ పోటీలు

- మై భారత్ యువ అధికారి పి.ప్రదీప్ కుమార్

ప్రజాశక్తి- కడప అర్బన్



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

భారత ప్రభుత్వం క్రీడా మంత్రిత్వ శాఖ, మైభారత్, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పురుషులకు వాలీబాల్, మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు మై భారత్ యువ అధికారి కడప శాఖ పి.ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కమలాపురం సిఎస్ఎస్ఆర్, సిఆర్ఆర్ఎం డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కాలేజ్ క్రీడా మైదానంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కమలాపురంలో శనివారం ఉదయం 9.00 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలలో 16 నుంచి 28 సంవత్సరాల లోపు యువకులు, యువతులు పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలలో గెలుపొందిన జట్లకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేస్తామని పేర్కొన్నారు.వాలీబాల్ పోటీలలో పాల్గొనదలచిన జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి పిడి ఎస్.అద్భుత్ కుమార్ - 93814 54069, జూటూరు విజయ్ కుమార్- 91605 31138లో సంప్రదించాలని తెలిపారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప నగరంలోని రైతు బజారు సర్కిల్ వద్ద ట్రాఫిక్ సిఐ సురేష్‌రెడ్డి ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేశారు. ప్రతి వాహనాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 31న ఎవరైనా డ్రంక్ అండ్ చేసి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని తెలిపారు. నడిపితే తల్లిదండ్రులకు శిక్ష తప్పదని చెప్పారు.

జిల్లా మీడియా అధ్యక్షులుగా చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : అఖిలభారత రెడ్డి సంఘం వైఎస్ఆర్ కడప జిల్లా మీడియా విభాగం అధ్యక్షునిగా చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన పాపన, చంద్రశేఖర్‌రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర మీడియా విభాగం అధ్యక్షులు విజయవాడకు చెందిన కుర్రే, రాజేంద్రనాథ్ రెడ్డి అఖిలభారత రెడ్డి సంఘం వ్యవస్థాపకులు నారుపల్లె, జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగెండ్ల, వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా మీడియా విభాగపు అధ్యక్షునిగా నియమించినందుకు జిల్లా వ్యాప్తంగా అఖిల భారత రెడ్డి సంఘం అభివృద్ధికి తన శాయ శక్తులా కృషి చేస్తానని తెలిపారు.

మన్మోహన్‌సింగ్ చరితార్థుడు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : మాజీ ప్రధాని, పద్మ విభూషణ్ డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచ చరిత్రలోనే ఒక విలక్షణమైన, విశిష్టమైన రాజకీయ నాయకుడని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో మన్మోహన్ సింగ్ ద్వితీయ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చరితార్థుడు, చరిత్రకారుడు కారణజన్ముడు అని కీర్తించారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన దేశానికి సేవలు అందించారని చెప్పారు. ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, గృహహింస నిరోధక చట్టం, ఆధార్ కార్డులు ప్రవేశపెట్టడం ఇలాంటి ఎన్నో చారిత్రాత్మకమైన చట్టాలు ఆయన పాలనలో అమలుకి వచ్చాయాని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రసాద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, తులసిరెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు, వినయ్ బాల వీరప్ప పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- కలసపాడు : సిఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని బద్వేల్ టిడిపి ఇన్‌ఛార్జి రితీష్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బద్వేల్ పార్టీ కార్యాలయంలో కలసపాడుకు చెందిన మాదిరాజు శ్రీలక్ష్మికి రూ. 20 వేలు, పోకల చిన్న సుబ్బయ్యకు రూ. 70 వేలు, చింతలపల్లె ఏక పత్తిని విజయలక్ష్మికి రూ. 36 వేలు, లింగారెడ్డి పల్లె గ్రామానికి చెందిన వారికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమ ంలో కలస పాడు టిడిపి గ్రామ కమిటీ ప్రెసిడెంట్ శ్రవణ్ కుమార్‌రెడ్డి, పాల్గొ న్నారు.